# నేడు ఆదిలాబాద్‌కు హరీశ్‌రావు

- ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న మంత్రి
- ఉట్నూర్, ఆదిలాబాద్‌లో బహిరంగ సభలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు
- భారీ జన సమీకరణపై దృష్టి
- శ్రేణుల్లో మరింత జోష్



ఆదిలాబాద్‌లో డైట్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభ ఏర్పాట్లు

ఆదిలాబాద్, అక్టోబర్ 27 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగం గా నిర్వహించే సభల్లో శనివారం మంత్రి హరీశ్ రావు పాల్గొననున్నారు. జిల్లాలో రెండు చోట్ల జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం పది గంటలకు ఆయన ఉట్నూర్ చేరుకుంటారు. మండలపరిషత్ మైదానంలో ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం ఆదిలాబాద్‌కు చేరుకొని 12 గంటలకు డైట్ కళాశాల మైదానంలో ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే జోగు రామన్నకు మద్దతుగా నిర్వహించే బహిరంగ సభకు హాజ రై ప్రసంగిస్తారు. ఇప్పటికే రెండు చోట్లా నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉట్నూర్ సభ ఏర్పాట్లను జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పరిశీలించారు. ఆదిలాబాద్ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ పరిశీలించారు. పెద్ద సంఖ్యలో జనసమీకరణకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకుపోతున్నది. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు మమ్మరంగా ప్రచారం చేస్తూ ఓటును అభ్యర్థిస్తున్నా రు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్‌లో అభ్యర్థి అనిల్ జాదవ్, ఖానాపూర్‌లో అభ్యర్థి జాన్సన్ నాయక్ గ్రామాల్లో ఇంటింటా ప్రచా రం చేస్తున్నారు. ప్రభుత్వం పదేళ్లుగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది. సభలు, సమావేశాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టో ద్వారా ఎన్నికల తర్వాత కలిగే ప్రయోజనాలను కూడా ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా గులాబీ పార్టీకి అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణ చూసి పార్టీ అభ్యర్థులు, నాయకులు ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు.



ఆదిలాబాద్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామన్న



ఉట్నూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ జడ్పీచైర్మన్ జనార్దన్

# 'ప్రజా ఆశీర్వాద సభ'కు అంతా సిద్ధం

● 10 వేల మందితో బైక్‌ర్యాలీ ● ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్27: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు పూర్తయినట్లు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం సాయంత్రం సభ ఏర్పాట్లను బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ తులశ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య, ఆరోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదిలాబాద్ ప్రజా ఆశీర్వాద సభకు రానున్నరాని తెలిపారు. 10 వేల మంది కార్యకర్తలతో బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీ మావల నలంద కళాశాల నుంచి ప్రారంభమై పట్టణంలోని అన్ని చౌక్‌ల గుండా కొనసాగుతుందని తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం డైట్ మైదానంలో అన్ని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలాల్ అజయ్, అశ్రఫ్, నాయకులు సాజీదుద్దీన్, తదితరులున్నారు.

### ఉట్నూర్‌లో..

అక్టోబర్27: ఉట్నూర్‌కు రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు రానున్న నేపథ్యంలో జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ శుక్రవారం స్థానిక ఎంపీడీవో గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి మాట్లాడారు. స్టేజీ ఏర్పాటు, వీఐపీ గ్యాలరీ, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే ఆయా పనులు కేటాయించిన వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, నాయకులు సెడ్మకి సీతారాం, మర్సుకోల తిరుపతి, దావుల రమేశ్, సింగారే భరత్, సలీం, ముజీబ్, రాజేశ్వర్, కాటం రమేశ్, తదితరులున్నారు.



మంత్రి అల్లోల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

# జనరంజకంగా సీఎం కేసీఆర్ పాలన

● కాంగ్రెస్ రైతు వ్యతిరేకి, బీజేపీది మతతత్వ ధోరణి ● ఆ రెండు పార్టీలను ప్రజలు నమ్మరు
● మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ● నిర్మల్‌లో ఇంటింటా ప్రచారం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 27: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగిస్తున్నారని, మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని మంత్రి, నిర్మల్ ఎమెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ నుంచి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వృద్ధులు, మహిళలను, ఆప్యాయంగా పలకరిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను వివరిస్తూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అంతకుముందు ఇంద్రకరణ్ రెడ్డి ప్రచార రథంలో బంగల్‌పేట్‌కు రాగా, బీఆర్ఎస్ శ్రేణులు, బైక్ ర్యాలీగా ఆయన వెంట వచ్చారు. డప్పులు, బ్యాండు మేళాలతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో ఎదురు వచ్చి బొట్టు పెట్టి తమ కాలనీల్లోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని తెలిపారు. ప్రస్తుత మ్యానిఫెస్టోలో ఉన్న హామీలను తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ ఓట్లు అడగాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని, ఇప్పుడే తాము అధికారంలోకి వచ్చినట్లు సీఎం అయినట్లు భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అని, దానిని అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇక బీజేపీ మతతత్వ ధోరణితో వెళ్తున్నదని, ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. బంగల్‌పేట్ దసరా వేడుకల్లో బీజేపీ నేత ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం హేయమని మండిపడ్డారు.

### అమ్మవారికి పూజలు

పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ అమ్మవారిని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని 2,3,4,5 వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారాన్ని ప్రారంభించారు. ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన మంత్రికి కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు అందించి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, ప్రజలు తదితరులున్నారు.

### బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదలకు వరం

### ప్రగతిని చూసి ఓటెయ్యండి

సోన్, అక్టోబర్ 27: పదేళ్లలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పి వారందరినీ ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సమీపంలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగడం లేదని, రాష్ట్రం లాంటి పథకాలు ప్రవేశపెడితే బాగుంటుందని అక్కడి ప్రజలు కితాబునిస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్మల్ గ్రామానికి చెందిన వందలాది మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. సోన్ బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, మండల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ అంకం గంగామణి శ్రీనివాస్, కిరణ్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు దొడ్డి నర్సయ్య, మాజీ సర్పంచ్ లత శ్రీనివాస్, తదితరులున్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అల్లోల